క్లుప్తంగా

ఆలూరు కోనలో పూజలు



శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి

తాడిపత్రిటౌన్: మండలంలోని ఆలూరు కోన రంగనాథస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున భక్తులు హాజరై స్వామికి అర్చనలు, అభిషేకాలు చేశారు. శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథ స్వామిని అర్చకులు పూలు, పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కంభగిరి స్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న కంభగిరిస్వామి

పెద్దపప్పూరు: మండలంలోని తిమ్మనచెరువులో వెలసిన ఎర్రమల లక్ష్మీకంభగిరి స్వామికి శనివారం నిర్వాహకులు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాలనుంచి విచ్చేసిన భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. శుక్ర, శని వారాల్లో స్వామిని దర్శించుకోవడానికి భక్తులు తరలివస్తుంటారని స్థానికులు తెలిపారు.

శనీశ్వరుడికి పూజలు



అలంకరణలో శనీశ్వరుడు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని తాడిపత్రి రహదారి పక్కన వెలసిన శనీశ్వరుని దేవాలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో ప్రధాన అర్చకులు బాబా స్వామి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు కుంకుమాభిషేకం అర్చనలు, తైలాభిషేకం పూజలు నిర్వహించిన మొక్కులు తీర్చుకున్నారు.

చిన్నారులను పనుల్లో పెట్టుకోవడం నేరం



బస్టాండ్ సమీపంలోని హోటల్‌లో తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

గుంతకల్లు: 14 ఏళ్లలోపు పిల్లలను పనుల్లో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు రాజా రమదేవి, ప్రతాప్‌నాయుడు హెచ్చరించారు. శనివారం పట్టణంలోని పలు హోటళ్లు, మెకానిక్ షెడ్లు, వెల్డింగ్ షాపుల్లో వారు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గురు 14 ఏళ్ల లోపు పిల్లలను గుర్తించి, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. అలాగే షాపు యజమానులపై కేసు నమోదు చేసి హెచ్చరికలు జారీ చేశారు. వారు మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను పనుల్లో పెట్టుకోవడం మంచి పద్ధతి కాదన్నారు. ప్రమాదకమైన షాపుల్లో, ఏరియాల్లో పిల్లలు పనిచేస్తూ తమకు పట్టుబడితే షాపు నిర్వాహకులకు రెండేళ్ల జైలు శిక్షతోపాటు రూ.50 వేలు జరిమానా విధిస్తామని హెచ్చరికలు జారీ చేశారు. కార్యక్రమంలో చైల్డ్ లైన్ అధికారి వెంకటేశ్వర్లు, సిబ్బంది సుప్రియ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



హనుమంతరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

పెద్దపప్పూరు: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు శనివారం నగదు ప్రోత్సాహకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. చాగల్లు గ్రామానికి చెందిన రిటైర్డు వ్యవసాయ అధికారి హనుమంతరెడ్డి ప్రథమ స్థానం మార్కులు సాధించిన శరణ్యకు రూ.5వేలు, ద్వితీయ స్థానం యామినికి రూ.3 వేలు, తృతీయ స్థానం గౌతమికి రూ.2 వేలు పంపిణీ చేశారు. ఏటా విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను పంపిణీ చేస్తున్న హనుమంతరెడ్డిని హెచ్‌ఎం ఆదినారాయణరెడ్డి, ఉపాధ్యాయులు సన్మానించారు.

● ఆహ్లాదం.. ఆనందం

గుంతకల్లు: పట్టణంలోని రైల్వే ఏరియాల్లో పచ్చదనంతో ఆహ్లాద వాతావరణం నెలకొంది. దీంతో పట్టణ ప్రజలు సేద తీరడానికి రైల్వే పరిసరాలకు ఎక్కువగా వెళ్తుంటారు. డీఆర్‌ఎం, కంట్రోల్ కార్యాలయం వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఎతైన వేప చెట్లు రహదారులను కప్పివేయడంతో ఆ నీడలో వాకింగ్ చేయడానికి పట్టణవాసులు ఆసక్తి చూపుతుంటారు. రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారుల్లో ఇరువైపులా భారీ చెట్లు ఉండడంతోపాటు రోడ్డు మధ్యలో షో చెట్లు వేయడంతో ఈ మార్గం గుండా వెళ్లే వాహదారులు, పాదచారులు ఎంతో ఆహ్లాదం పొందుతున్నారు. ఇక స్టేషన్‌కు ఎడమ వైపున దాదాపు మూడు ఎకరాల్లో పెద్ద ఎత్తున చెట్లు పెరగడంతో స్టేషన్ ప్రాంగణం మొత్తం పచ్చదనంతో కళకళలాడుతోంది. సాయంత్రం పూట పట్టణ ప్రజలు స్టేషన్ ప్రాంగణంలో సేద తీరుతుంటారు.



రైల్వేస్టేషన్ సమీపంలో పచ్చదనం పరుచుకున్న దృశ్యం



రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారిలో ఇలా..



డీఆర్‌ఎం కార్యాలయానికి వెళ్లే రహదారిలో వేప చెట్లు



కంట్రోల్ కార్యాలయ సమీపంలో పచ్చదనం

నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు

పెద్దపప్పూరు: నిబంధనలు ఉల్లంఘించి ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయాలని ప్రయత్నిస్తే కేసులు నమోదుచేయడంతో పాటు రౌడీషీట్ తెరుస్తామని ఇన్‌చార్జ్ ఎస్‌ఐ గౌస్‌బాషా హెచ్చరించారు. శనివారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. గ్రామసభలు నిర్వహించి పలు సూచనలు చేశారు. గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఉన్న శిలాఫలకాల ధ్వంసం చేస్తే కేసులు తప్పవన్నారు. ఎన్నికలకు ముందురోజు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసిన వారిలో ఎనిమిది మంది నిబంధనలను ఉల్లగించారన్నారు. వారికి జామీనుగా రూ.రెండు లక్షల పూచీకత్తు ఇచ్చిన వారిచేత సొమ్మురాబట్టేందుకు నోటీసులు పంపామన్నారు. గ్రామాల్లో ఎటువంటి సమస్య ఉన్నా పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని రాయల్ సర్కిల్ సమీపంలో శనివారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. రాజ కుళ్లాయప్ప అనే వ్యక్తి రోడ్డు దాటుతుండగా ఆటో ఢీ కొంది. ఘటనలో గాయపడిన రాజ కుళ్లాయప్పను స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

జాతీయస్థాయిలో 'గేట్స్'కు గుర్తింపు

గుత్తి: గుత్తి గేట్స్ ఇంజనీరింగ్ కాలేజీకి ఎన్‌పీటీఈఎల్ (నేషనల్ ప్రొగ్రామ్ ఆన్ టెక్నాలజీ ఎన్‌హాన్స్‌డ్ లెర్నింగ్) ఫలితాల్లో 167వ స్థానం దక్కిందని గేట్స్ కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ శనివారం తెలిపారు. ఎన్‌పీటీఈఎల్ అనేది యూనివర్సిటీ స్థాయి సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, హ్యూమనిటీస్ సబ్జెక్టుల కోసం నిర్వహించబడే జాతీయ స్థాయి ఈ-లెర్నింగ్ వేదిక. కేంద్ర మంత్రిత్వ శాఖ ద్వారా ఏర్పరిచిన ఈ వేదికకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ సంయుక్తంగా అభివృద్ధి చేశారు. ఎన్‌పీటీఈఎల్ సర్టిఫికేషన్ కోర్సులు సంవత్సరానికి రెండు సార్లు నిర్వహిస్తారు. జాతీయ స్థాయిలో పరీక్షలు ఉంటాయి. ఈ ఏడాది దేశ వ్యాప్తంగా నిర్వహించిన పరీక్షల్లో గేట్స్ కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభను కనబరిచారు. ఫలితాల్లో గేట్స్ కాలేజీకి జాతీయ స్థాయిలో 167వ స్థానం రావడంతో కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, ఎండీ రఘునాథ్ రెడ్డి, డైరెక్టర్ వాణి, ప్రిన్సిపాల్ డాక్టర్ సురయ హర్షం వ్యక్తం చేశారు.



గేట్స్ కాలేజీ భవనం

పాఠశాలలకు చేరిన పుస్తకాలు

యల్లనూరు: మండలంలోని 38 ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం మంజూరు చేసిన పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను అందజేశామని ఎంఈఓలు చంద్రశేఖర్, పరమేశ్వరరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కస్తూరిబా విద్యాలయం, ఆదర్శ మోడల్ స్కూల్‌కు శనివారం పుస్తకాలను వాహనాల్లో తరలించారు. మండలంలో 2,545మంది విద్యార్థులు ఉండగా ఇప్పటి వరకు ఎమ్మార్సీకి చేరిన 17,372 టెస్ట్‌బుక్స్ 13,280 నోటు బుక్స్, బూట్లు పాఠశాలలకు చేరాయి. ఇంకా ప్రభుత్వం నుంచి విద్యార్థులకు యూనిఫాం, బ్యాగ్‌లు రావాల్సి ఉంది. ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీ బాలాజీ, ఎమ్మార్సీ సిబ్బంది ప్రదీప్, ప్రవీణ్, గురు తదితరులు పాల్గొన్నారు.

పంట మార్పిడితో మేలైన దిగుబడులు

కణేకల్లు: ఏటా ఒకే రకమైన పంట సాగు చేయకుండా, పంట మార్పిడి చేసుకోవాలని డీఆర్‌సీ డీడీఏ మద్దిలేటి తెలిపారు. శనివారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ హాలులో ఖరీఫ్ సాగుకు సమాయత్తం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డీడీఏ మాట్లాడారు. రైతులు తప్పని సరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. భూసార పరీక్షల్లో వచ్చే సూక్ష్మపోషకాల ఫలితాలను బట్టి భూమికి అనుకూలమైన పంటలు సాగు చేసుకొని, తద్వారా మేలైన దిగుబడులు పొందాలన్నారు. వాతావరణం అనుకూలించి వర్షాలు సమృద్ధిగా కురిస్తే జూలై 15 వరకు వేరుశనగ సాగు చేసుకోవచ్చని ఆయన సూచించారు. అరకొర పదునైతే కొర్ర, ఉలవలు, పెసర, అలసందులు, కందులు తదితర పంటలు సాగు చేసుకోవాలన్నారు. రసాయనిక ఎరువుల వాడకంతో పెట్టుబడులు పెరిగి, లాభాలు తగ్గుతాయన్నారు. సేంద్రియ ఎరువుల వాడకాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. వరి, వేరుశనగ పంట సాగులో యాజమాన్య పద్ధతులను ఆయన వివరించారు.

ప్రమాదమని తెలిసినా..



గూడ్స్ రైలు బోగీల మధ్య ఎక్కి వస్తున్న ప్రయాణికులు



గూడ్స్ రైలు కింద నుంచి రెండో ప్లాట్ ఫారంలోకి వెళ్తున్న దృశ్యం

తాడిపత్రిరూరల్: స్థానిక రైల్వే స్టేషన్‌లో నిలిచిన ఉన్న రైళ్ల కింద నుంచి వెళ్లడం ప్రమాదమని తెలిసినా ప్రయాణికులు లెక్క చేయడం లేదు. రైలు కదిలితే ప్రాణాలు పోతాయి. అయినా పట్టించుకోవడం లేదు. మొదటి ప్లాట్ ఫారం నుంచి రెండో ప్లాట్ ఫారంలోకి వెళ్లడమే వారికి ముఖ్యం. ప్లాట్ ఫారాలకు మధ్యలో గూడ్స్ రైళ్లు నిలిచి ఉన్నా ఎలాంటి పట్టింపు లేదు. వాటి కింద నుంచి దూరి అవతలికి వెళ్లడమే. ప్లాట్ ఫారంపై వున్న పోలీసులు కానీ తోటి ప్రయాణికులు కానీ హెచ్చరించినా పట్టించుకోరు. ఒకటి నుంచి రెండవ ప్లాట్ ఫారానికి వెళ్లడానికి ఫుట్ బ్రిడ్జి ఉన్న పట్టించుకోవడం లేదు. రెండో ప్లాట్ ఫారం నుంచి రైలు దిగిన ప్రయాణికులు సైతం పట్టాలకు అడ్డంగా మొదటి ప్లాట్ ఫారానికి వెళుతున్నారే తప్ప ఫుట్ బ్రిడ్జిని ఉపయోగించడం లేదు. రైల్వే అధికారులు స్పందించి ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బక్రీద్ ప్రశాంతంగా జరుపుకోండి



బుక్కరాయసముద్రం స్టేషన్ ఆవరణలో మాట్లాడుతున్న డీఎస్పీ శివారెడ్డి



యాడికిలో మాట్లాడుతున్న డీఎస్పీ జనార్దన్ నాయుడు

యల్లనూరు: ముస్లింలు బక్రీద్ పండుగను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని పుట్లూరు సీఐ సుబ్రహ్మణ్యం సూచించారు. యల్లనూరు స్టేషన్‌లో శనివారం ఆయన ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఆదివారం, సోమవారం ప్రతి గ్రామంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో పండుగ చేసుకోవాలన్నారు. ఏవైనా గొడవలు, అల్లర్లు చేసుకుంటే కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు శ్రీనివాసగౌడ్, సంపత్‌కుమార్, కానిస్టేబుళ్లు బాలరాజు, నాగరాజు హోంగార్డులు, తిమ్మంపల్లి, శింగవరం, వెన్నపూసపల్లి, యల్లనూరు, కల్లూరు తదితర గ్రామాల ముస్లింలు పాల్గొన్నారు.

పుట్లూరు: బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ హేమాద్రి సూచించారు. శనివారం ఆయన మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో శాంతి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఎలాంటి ఘర్షణలు లేకుండా పండుగ ప్రశాంతంగా జరిగేలా అందరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

గార్లదిన్నె: బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ మహమ్మద్ గౌస్ సూచించారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో బక్రీద్ పండుగ నిర్వహణపై ముస్లింలతో సమావేశం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ మండలవ్యాప్తంగా భద్రతా చర్యలు ఏర్పాటు చేశామన్నారు.

బుక్కరాయసముద్రం: ముస్లింలు ప్రభుత్వ నిబంధనలు తప్పక పాటించాలని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకట శివారెడ్డి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ముస్లింలతో బక్రీద్ పండుగ నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పండుగ నేపథ్యంలో మత పరమైన సమస్యలు తలెత్తకుండా ముస్లింలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు , పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

యాడికి: ప్రతిఒక్కరూ గొడవలకు దూరంగా ఉండాలని తాడిపత్రి డీఎస్పీ జనార్దన నాయుడు సూచించారు. మండలంలోని కోనుప్పలపాడు గ్రామ సమీపంలో కోన క్షేత్రాన్ని సందర్శించి కోన రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కోన ఉప్పలపాడులోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని హెచ్ఎం పెద్దన్నను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు డీఎస్పీ పోలీస్టేషన్‌ను సందర్శించి మండలంలోని ముస్లిం సోదరులతో సమావేశమై ఈ నెల 17న జరగనున్న బక్రీదు పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాలపై సిబ్బంది ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. కార్యక్రమంలో సీఐ నాగార్జున రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



పుట్లూరులో శాంతి కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్ఐ హేమాద్రి



గార్లదిన్నె పోలీస్ స్టేషన్‌లో ముస్లింలతో సమావేశం నిర్వహించిన ఎస్ఐ మహమ్మద్‌గౌస్



యల్లనూరులో ముస్లిం మతపెద్దలతో మాట్లాడుతున్న పుట్లూరు సీఐ సుబ్రహ్మణ్యం

నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటాం

తాడిపత్రి అర్బన్: ఎన్నికల అనంతరం జరిగిన ఘర్షణల్లో ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసిన నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని తాడిపత్రి డీఎస్పీ కె.జనార్దన్‌నాయుడు అన్నారు. శనివారం స్థానిక అర్బన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ నాగేంద్ర ప్రసాద్‌తో కలసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు. ఎన్నికల నేపథ్యంలో బైండోవర్ చేసిన 41 మంది నుంచి బాండ్‌లో పేర్కొన్న సొమ్మును రికవరీ చేస్తామన్నారు. ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగిస్తూ శిలాఫలకాలు పగలగొట్టే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. అలాంటి వారిని గుర్తించి సస్పెక్ట్ షీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. రాజకీయ నాయకుల పిలుపు మేరకు క్షణికావేశంలో ఘర్షణలలో పాల్గొని జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఇటీవల తాడిపత్రిలో ఓ మహిళను బెదిరించి బంగారు ఆభరణాలు చోరీ ఘటన, బ్యాంకు నుంచి నగదును విత్‌డ్రా చేసుకుని తీసుకొస్తున్న వ్యక్తి నుంచి డబ్బు అపహరించిన ఘటనపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. రాత్రి వేళల్లో బీట్ పెంచామన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ జనార్దన్‌నాయుడు. చిత్రంలో సీఐ నాగేంద్రప్రసాద్

పెద్దవడుగూరు: ప్రతిఒక్కర ప్రశాంత జీవనం సాగించాలి తాడిపత్రి డీఎస్పీ జనార్దన్‌నాయుడు సూచించారు. శనివారం మండలంలోని అప్పేచర్లలో ఆయన పర్యటించారు. ఆయన మాట్లాడుతూ ఎవరైనా పాత కక్షలను దృష్టిలో ఉంచుకొని గొడవలు సృష్టించడానికి ప్రయత్నిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తినా పోలీసుల దృష్టికి తీసుకరావాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ స్టార్టర్ బాక్స్‌ల చోరీ

గార్లదిన్నె: మండలంలోని కొట్టాలపల్లిలో శుక్రవారం రాత్రి ముగ్గురు రైతుల పొలాల్లో విద్యుత్ స్టార్టర్ బాక్స్‌లు చోరీ చేశారు. వివరాలు.. గ్రామానికి చెందిన పురుషోత్తం,శీనా నాయక్ పొలాల్లో గుర్తుతెలియని వ్యక్తులు విద్యుత్ స్టార్టర్ బాక్స్‌లు దొంగలించుకెళ్లారు. అలాగే ఆదిశేషయ్య తోటలో మందు పిచికారీ చేసే పంపు చోరీ చేశారు. ఈ మేరకు బాధిత రైతులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సీసీ రోడ్డు నిర్మించండి

గుంతకల్లుటౌన్: పాతగుంతకల్లులోని ఊరువాకిలి వద్ద ఉన్న సుంకులమ్మ ఆలయం వద్ద సీసీ రోడ్డు, కల్వర్టులను నిర్మించాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు వారు శనివారం మున్సిపల్ కార్యాలయంలో అధికారి వెంకటరమణకు వినతి పత్రం అందజేశారు. త్వరలో ఆలయ ప్రారంభోత్సవం జరుగనున్న నేపథ్యంలో సీసీ రోడ్డు, కల్వర్టు పనులను మంజూరు చేయించి, త్వరతగతిన పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బండారు కృష్ణమూర్తి, పట్టణ అధ్యక్షుడు వడ్డే రమేష్, నాయకులు వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి, క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను అంగన్‌వాడీల్లో చేర్పించండి



తాడిపత్రిలో మన అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో చిన్నారులతో అంగన్‌వాడీ కార్యకర్తలు



గుంతకల్లు మండలం కసాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



పామిడిలో 'అంగన్‌వాడీ పిలుస్తోంది రా' ర్యాలీ చేస్తున్న దృశ్యం

తాడిపత్రి అర్బన్: మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దస్తగిరమ్మ సూచించారు. మన అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని జయనగర్ కాలనీలో ఉన్న 3వ కేంద్రంలో మన అంగన్‌వాడీ పిలుస్తోంది రా కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ చిన్నారుల పూర్వ ప్రాథమిక విధ్య, ఆటపాటలు, వారి ఆరోగ్యమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఐదు సంవత్సరాల పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో చిన్నారులు, వారి తల్లిదండ్రులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్: మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను ప్రతి ఒక్కరినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పావతి తల్లిదండ్రులకు సూచించారు. శనివారం మండల పరిధిలోని కసాపురం, నక్కనదొడ్డి, ఓబుళాపురం, మొలకలపెంట, దోసలుడుకి తదితర గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు చిన్నారులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తూ అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

గుత్తి: పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో రెండో రోజు శనివారం కూడా అంగన్‌వాడీ పిలుస్తోంది రా కార్యక్రమాలు నిర్వహించారు. సీడీపీఓ ఢిల్లీశ్వరి, సూపర్ వైజర్ నాగేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

పామిడి: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్, మంజుటాకీస్‌వీధి, పామిడి-5 అంగన్‌వాడీ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో అంగన్‌వాడీ పిల్లలు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కే జయంతి, షేకున్‌బీ, వీ యశోద, హెల్పర్లు కే కీర్తి, ఎస్ మాబున్నీ, వీ దుర్గమ్మ, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పామిడి: మండలంలోని మోడల్‌స్కూల్‌లో 7, 8, 9 తరగతులకు సంబంధించి ఖాళీ సీట్ల భర్తీ కోసం విద్యార్థులు ఈ నెల 17లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ అరుణ శనివారం కోరారు. 7వ తరగతిలో జనరల్-1, 8వ తరగతిలో జనరల్-4, 9వ తరగతిలో జనరల్-1 చొప్పున మొత్తం 6 ఖాళీ సీట్లు ఉన్నాయన్నారు. ఈ నెల 19వ తేదీ ప్రవేశపరీక్ష ఉంటుందన్నారు.